సూర్య



# ధీర
VOICE OF WOMEN

మనం దేనికి అర్హులమో అదే మనకు లభిస్తుంది.

– సూక్తి



న వ్వుతూ, సిగ్గులొలికిస్తూ మాట్లాడే లేడీ టివి యాంకర్స్ బుల్లితెరపై వివిధ కార్యక్రమాలను రక్తికట్టిస్తుంటారు. అందమైన ముఖ సౌందర్యంతో అనర్గళంగా మాట్లాడుతూ ప్రేక్షకులను కట్టిపడేస్తుంటారు. ఇటువంటి కొందరు పాపులర్ లేడీ టివి యాంకర్స్ పలు హిట్ టివి షోలకే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారంటే అతిశయోక్తి కాదు. వీరిలో ఉదయభాను, ఝాన్సీ, సుమ, కలర్స్ స్వాతి తదితరులు నేడు బుల్లితెరపై యాంకర్లుగా ప్రేక్షకులను మైమరపిస్తున్నారు. సరదాగా మాట్లాడుతూ అందర్నీ ఆకట్టుకుంటున్న ఈ టివి యాంకర్ల గురించి తెలుసుకుందామా...

### ఉదయభాను...

చక్కటి అందం...మోముపై ఎల్లవేళలా చిరునవ్వు... సరదాగా అనిపించే యాంకరింగ్... ఇవన్నీ కలిస్తే ఆమే ఉదయభాను. నేడు బుల్లితెరపై యాంకరింగ్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు ఆమె. ఇప్పటివరకు ఎన్నో తెలుగు టివి షోలలో యాంకరింగ్ చేసి తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ఒకేసారి ఆరు ఛానెల్స్‌లో ఆరు టివి షోలను వివిధ గెటప్‌లలో యాంకరింగ్ చేసిన ఘనత ఆమెకే దక్కుతుంది. కేవలం యాంకర్‌గానే కాకుండా సినీతారగా, డ్యాన్సర్‌గా సైతం ఆమె పేరు,ప్రఖ్యాతులు సంపాదించారు. వివిధ టివి కార్యక్రమాలకు ఆమె వ్యాఖ్యానం ఎంతో సహజసిద్దంగా ఉంటుంది. నేడు తెలుగు టెలివిజన్ ఇండస్ట్రీలో ఎక్కువగా పారితోషికం తీసుకుంటున్న యాంకర్ ఆమె కావడం విశేషం. ఇక 15 సంవత్సరాల వయసులో బుల్లితెరపై హార్లిక్స్ హృదయాంజలి కార్యక్రమంలో కనిపించారు ఉదయభాను. ఆ తర్వాత పాపులర్ టివి షో 'వన్స్ మోర్ ప్లీజ్'లో హాస్య నటుడు వేణు మాధవ్‌తో కలిసి కో-యాంకరింగ్ చేసి బుల్లితెర ప్రేక్షకులను మైమరపించారు. సాహసం చేయరా డింభకా, జానవులే నెరజానవులే, నీ ఇల్లు బంగారం కాను, ఢీ, రెలా రె రెలా వంటి హిట్ టివి షోలకు ఆమె యాంకరింగ్ చేశారు. ఆమె చేసిన టివి షోలకు ఎక్కువ రేటింగ్ కూడా లభిస్తుండడం విశేషం. ఇక యాంకర్‌గానే కాదు పలు టాలీవుడ్ సినిమాల్లోనూ నటించారు ఉదయభాను. ఎర్ర సైన్యం, కొండవీటి సింహం, శ్రావణ మాసం తదితర చిత్రాల్లో నటించి సినీతారగా పేరుతెచ్చుకున్నారు. ఉదయభాను లీడర్(2010) చిత్రంలో చేసిన ఐటమ్‌సాంగ్ ఆమెకు మంచి గుర్తింపును తీసుకువచ్చింది. ఇక రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్‌లో జన్మించిన ఉదయభాను నాలుగు సంవత్సరాల వయసు ఉన్నప్పుడే తండ్రి మృతిచెందారు. ఆ తర్వాత ఆమె ఎన్నో కష్టాలకు ఓర్చి జీవితంలో క్రమ,క్రమంగా పైకి ఎదిగారు. బుల్లితెర రంగంలోకి ప్రవేశించి నేడు ప్రముఖ యాంకర్‌గా పేరుతెచ్చుకున్నారు.

*సాహసం చేయరా డింభకా, జానవులే నెరజానవులే, నీ ఇల్లు బంగారం కాను, ఢీ, రెలా రె రెలా వంటి హిట్ టీవీ షోలకు ఉదయభాను యాంకరింగ్ చేశారు. ఆమె చేసిన టీవీ షోలకు ఎక్కువ రేటింగ్ లభిస్తుండడం విశేషం.*





## బుల్లితెర
# రాణులు
## ఏళ్ళుగా రాజ్యమేలుతున్న యాంకర్లు

- తెలుగు టీవీ ఇండస్ట్రీలో టాప్ యాంకర్ ఉదయభాను
- ఈ ఇండస్ట్రీలో ఎక్కువగా పారితోషికం తీసుకుంటున్న యాంకర్
- 'టాక్ ఆఫ్ ది టౌన్' వంటి టీవీ షోలు చేసి పాపులారిటీ తెచ్చుకున్న ఝాన్సీ
- సినిమాల్లోనూ నటిస్తూ ప్రేక్షకులను మురిపిస్తున్నారు
- మైమరపించే చిరునవ్వు... చక్కటి వ్యాఖ్యానం యాంకర్ సుమ సొంతం
- యాంకర్‌గా రాణించి సినిమాల్లో హీరోయిన్‌గా చేస్తున్నారు కలర్స్ స్వాతి

ఒ కప్పుడు టివి యాంకర్లంటే కార్యక్రమాలకు అనుగుణంగా సీరియస్‌గా మాట్లాడుకుంటూ పోయేవారు. కానీ నేడు పరిస్థితి ఎంతో మారింది. బుల్లితెర ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు టివి ఛానెల్స్‌లో విభిన్నమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రొటీన్‌కు భిన్నంగా కార్యక్రమాలుండే విధంగా చూస్తున్నారు. దీనికి తగ్గట్టుగా కార్యక్రమాల యాంకరింగ్ ఉండాలని నిర్వాహకులు కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బుల్లితెర ప్రేక్షకులను మైమరపించేవిధంగా యాంకరింగ్ చేస్తున్నారు కొందరు పాపులర్ యాంకర్లు.

### ఝాన్సీ...



ముచ్చటైన వ్యాఖ్యానంతో బుల్లితెర ప్రేక్షకులను అలరించే అందమైన యాంకర్ ఝాన్సీ. పలు పాపులర్ టివి షోలలో విభిన్న గెటప్‌లతో దర్శనమిస్తూ ఆకట్టుకునేవిధంగా యాంకరింగ్ చేయడం ఆమెకు వెన్నతో పెట్టిన విద్యం. కేవలం యాంకర్‌గానే కాకుండా పలు సినిమాల్లో కూడా నటించి చక్కటి నటీమణిగా పేరుతెచ్చుకున్నారు ఝాన్సీ. ఫ్యామిలీ సర్కస్ వంటి చిత్రాల్లో ఆమె నటన అందరినీ మైమరపించింది. కొన్ని సినిమాల్లోని పాత్రలు ఆమెకు ఎంతగానో పేరును తీసుకువచ్చి పెట్టాయి. ఓ చిత్రంలో విదేశాల నుంచి తిరిగి వచ్చిన మహిళగా గోదావరి యాసలో మాట్లాడుతూ ప్రేక్షకులను కట్టిపడేశారు. ఇక టాక్ ఆఫ్ ది టౌన్ వంటి టివి షోలలో ఆమె బహుముఖ అవతారాలలో కనిపిస్తూ విభిన్నమైన యాసలో మాట్లాడుతూ బుల్లితెర ప్రేక్షకులను మురిపించారు. ఇతర యాంకర్ల కంటే విభిన్నంగా పలు టివి షోలలో గెస్ట్‌లను ఇంటర్వ్యూ చేస్తూ కార్యక్రమాలను రక్తికట్టిస్తున్నారు. బిగ్ ఎఫ్‌ఎం రేడియోలో కూడా ఝాన్సీ యాంకరింగ్ చేశారు. దీంతో పాటు ఆమెకు సొంతంగా ఓ రికార్డింగ్ స్టూడియో కూడా నిర్వహిస్తున్నారు.

*బిగ్ ఎఫ్‌ఎం రేడియోలో కూడా ఝాన్సీ యాంకరింగ్ చేశారు. ఆమె సొంతంగా ఓ రికార్డింగ్ స్టూడియో కూడా నిర్వహిస్తుండడం విశేషం.*



టివి యాంకర్‌గానే కాదు సినీ తారగా కూడా రాణిస్తున్న అమ్మాయి స్వాతి రెడ్డి. కలర్స్ స్వాతిగా బుల్లితెరపై పాపులారిటీ సంపాదించారు ఆమె. టెలివిజన్ షో కలర్స్ ద్వారా పేరుతెచ్చుకున్న ఆమెను కలర్స్ స్వాతిగా పిలవడం ప్రారంభించారు. కలర్స్ షో మా టివిలో ప్రసారమైంది. ఇక యాంకరింగ్‌లో రాణించిన అనంతరం ఆమె సినిమాల్లో సహాయ నటిగా చేయడం ప్రారంభించారు. ఆ తర్వాత 2008లో తమిళ చిత్రం సుబ్రమణ్యపురమ్‌లో హీరోయిన్‌గా చేసి పేరుతెచ్చుకున్నారు. తెలుగులో అష్టాచమ్మా చిత్రం ఆమెకు ఎంతో పేరు తీసుకువచ్చిపెట్టింది. ఈ చిత్రానికిగాను ఆమె ఉత్తమ నటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు, నంది అవార్డును దక్కించుకోవడం విశేషం. ఇక స్వాతి పుట్టింది ఒకప్పటి సోవియట్ యూనియన్ రష్యాలోని వ్లాదివొస్తోక్‌లో. ఆమె తండ్రి ఇండియన్ నేవీలో పనిచేసేవారు. ఉద్యోగరీత్యా ఆయన సోవియట్ యూనియన్ రష్యాకు సబ్‌మెరైనర్‌గా బదిలీ అయ్యారు. ఆ తర్వాత వారి కుటుంబం విశాఖపట్నంకు వచ్చింది. స్వాతి చిన్నతనమంతా వైజాగ్‌లోనే గడిచింది. వారి కుటుంబం హైదరాబాద్‌కు మకాం మార్చిన అనంతరం ఆమె యూసుఫ్‌గూడాలోని సెయింట్ మేరీస్ కాలేజీలో చదువుకున్నారు. బయోటెక్నాలజీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. 17 సంవత్సరాల వయసులో టివి రంగంలోకి యాంకర్‌గా రంగప్రవేశం చేశారు. మా టివిలో కలర్స్ కార్యక్రమానికి హోస్ట్‌గా చేసి మంచి పేరుతెచ్చుకున్నారు. హుషారెత్తించే వ్యాఖ్యానంతో ఈ కార్యక్రమాన్ని రక్తికట్టించారు. దీంతో మంచిరేటింగ్ సంపాదించిన ఈ షో ప్రైమ్‌టైమ్ స్లాట్‌లో ప్రసారమైంది. 150 ఎపిసోడ్‌లకు స్వాతి యాంకరింగ్ చేయడం విశేషం. ఇక సినిమాల్లో నటిగానే కాకుండా డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా, ప్లే బ్యాక్ సింగర్‌గా కూడా చేశారు. 2008లో జల్సా చిత్రం హీరోయిన్ ఇలియానా డిక్రూజ్‌కు స్వాతి డబ్బింగ్ చెప్పారు. 2011లో ప్లేబ్యాక్ సింగర్‌గా పాడడం ప్రారంభించారు.

**కలర్స్ స్వాతి పుట్టింది ఒకప్పటి సోవియట్ యూనియన్ రష్యాలోని వ్లాదివొస్తోక్‌లో. ఆమె తండ్రి ఇండియన్ నేవీలో పనిచేసేవారు. ఉద్యోగరీత్యా ఆయన సోవియట్ యూనియన్ రష్యాకు సబ్‌మెరైనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన అక్కడ కొంతకాలం పనిచేశారు.**



### సుమ కనకాల...



పాపులర్ తెలుగు టివి యాంకర్లలో సుమ కనకాల ఒకరు. ఆమె సినీ, టివి నటుడు రాజీవ్ కనకాల భార్య. సినీ, టివి నటుడు దేవదాస్ కనకాలకు స్వయానా కోడలు సుమ. 1978 సంవత్సరం జూన్ 27న జన్మించిన ఆమె నేడు పలు హిట్ టివి షోలకు యాంకరింగ్ చేస్తూ తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. మైమరపించే చిరునవ్వు...చక్కటి వ్యాఖ్యానంతో బుల్లితెర ప్రేక్షకులను సుమ ఆకట్టుకుంటున్నారు. కేరళ రాష్ట్రానికి చెందిన మళయాళీ అమ్మాయి ఆమె. కానీ ఆమె తెలుగు భాషను ఎంతో చక్కగా మాట్లాడడమే కాదు ఏకంగా యాంకరింగ్ చేస్తూ ఈ రంగంలో ఉన్నతస్థానానికి చేరుకోవడం విశేషం. మళయాళం, తెలుగుతో పాటు హిందీ, ఇంగ్లీష్ భాషలను చక్కగా మాట్లాడే సుమ యాంకరింగ్ పలు టివి షోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. టివి యాంకర్ ఝాన్సీ, సుమలు ఇద్దరూ కలిసి ఒకేసారి యాంకరింగ్ కెరీర్‌ను ప్రారంభించారు. ఇద్దరూ రాణించి యాంకర్లుగా పాపులారిటీ సంపాదించుకున్నారు. సినీ నేపథ్య గాయని సునీత సుమకు మంచి ఫ్రెండ్.

*కేరళ చెందిన మళయాళీ అమ్మాయి సుమ కనకాల. ఆమె తెలుగు భాషను ఎంతో చక్కగా మాట్లాడడమే కాదు ఏకంగా యాంకరింగ్ చేస్తూ ఈ రంగంలో ఉన్నతస్థానానికి చేరుకోవడం విశేషం.*

– ఎస్.అనిల్ కుమార్



## వెల్లివిరిసిన
# విద్యాకుసుమం

- విద్యాదాహం తీరనిది.. అవార్డుల వర్షం ఆగనిది..
- శోధించి సాధించిన 'అందాల' తరుణి..

ఒక డిగ్రీ చేయడానికే భూమ్యాకాశాలను ఏకం చేసినంత కష్టపడినట్టు భావించే వ్యక్తులున్న ఈ రోజుల్లో ఏకంగా 17 డిగ్రీలు సాధించిన తొలి మహిళగా..'ఇండియన్ బుక్ ఆఫ్ ది రికార్డు'లో కెక్కింది పద్మజారాణి. ప్రతి అవకాశాన్ని ఒక ఛాలెంజ్ లా తీసుకోవాలని.. ఎవరైనా విమర్శిస్తే.. కృంగిపోకుండా తేరుకుని సత్తా చూపాలని.. ఆ విధంగా మన సామర్థ్యంతో విమర్శకులు సైతం వారేవా అనేట్టు కష్టపడాలంటారు జ్యోతిష్యవాస్తు పండితురాలు డా॥ పద్మజారాణి. కృషి ఉంటే మనుషలు రుషులవుతారు అని నిరూపించిన ఆమె ఎన్నో అవార్డులు అమెకు 'హ్యాట్సాఫ్' అన్నాయి...

### తల్లిదండ్రుల ప్రభావం...

పద్మజ పుట్టి పెరిగిన వాతావరణం ఆమె ఎన్నో సాధించడానికి దోహదపడింది. తల్లి దుర్గా కుమారి ఎమ్.ఏ.(మ్యాథమెటిక్స్), ఎమ్.ఏ (లిటరేచర్) ఎమ్.ఈడీ. చేశారు. దీంతో తన తల్లిలా తనూ కూడా వివిధ రకాల డిగ్రీలు చేయాలనే పట్టుదలతో తొలుత ఎమ్.ఎస్.సీ మ్యాథమెటిక్స్ చేశారు. ఇంట్లో అందరూ చదువు పట్ల అత్యంత ఆసక్తి కలిగి ఉండడంతో అందరూ సహకరించే వ్యక్తులుండడంతో మరింత మరెన్నో సాధించడానికి పట్టుదలతో శ్రమించింది.

### రచయిత్రిగా...

అమ్మమ్మ వడిలో కూర్చుని రాజుల కథలు వినే వయస్సులోనే కథలు రాసి అందరినీ అశ్చర్య పరిచింది పద్మజ. నేడు భవిష్య వాణి, మహర్షి కాలజ్ఞానం వంటి ఎన్నో వార పత్రికలకు ఆర్టికల్స్, కథలు వ్యాసాలు రాస్తున్నారు.. సమయం చిక్కితే కొత్త పని చేయాలని ఆవిడప్రయత్నిస్తారామె. ప్రముఖ యోగుల జాతకాలపై ఆమెచేసిన పరిశోధనను 'యోగులు.. యోగజాతకులు' అనే పుస్తకంగా వెలువరించారు.

### జోతిష్య వాస్తు పండితురాలు...

**ప్రొఫైల్**

| | |
|---|---|
| పూర్తి పేరు | : ఈదుపుగంటి పద్మజారాణి |
| జన్మ స్థలం | : రాజమండ్రి |
| పుట్టిన తేది | : 23 ఆగస్టు |
| తల్లిదండ్రులు | : పిసిపటి దుర్గా కుమారి, సూర్యనారాయణ |
| వృత్తి | : ప్రిన్సిపల్, బిఎడ్ కళాశాల హైదరాబాద్ |
| ప్రవృత్తి | : జ్యోతిష్య వాస్తు పండితురాలు |
| చదువు | : ఎం.ఎస్.సి. (మ్యాథ్స్), ఎం.ఇ.డి, ఎం.ఎ. (తెలుగు), ఎం.ఎ. (సంస్కృతం), ఎం.ఎ. (ఆస్ట్రాలజీ), పి.జి. డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్ వాస్తు |
| అవార్డులు | : ● అత్యధిక డిగ్రీ పట్టాలు పొందిన మహిళగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం, ● ఫిలాసఫీలో గౌరవ డాక్టరేట్, ● ఆదర్శ మహిళా పురస్కారం, ● రెండుసార్లు ఉగాది పురస్కారాలు, ఇంకా మరెన్నో |

జ్యోతిష్యం అంటే అది పురుషులు మాత్రమే ఎంచుకోగల వృత్తి అని చాలా మందిలో భావన కాని ఒక మహిళ ఏదైనా సాధించగలదని నిరూపించారు పద్మజారాణి. తన డిగ్రీల వేటలో ఎం.ఏ. (జ్యోతిష్యం), ఇంజనీరింగ్ వాస్తులో పీజీ డిప్లమా చేసి జ్యోతిష్యాన్ని ప్రవృత్తిగా చేసుకున్నారు. నేడు ఎంతో మంది ప్రముఖులు తమ భవితవ్యాన్ని తెలుసుకునేందుకు ఆమె అపాయింట్ మెంట్ కోసం వేచి చూస్తారంటే అతిశ యోక్తి కాదు. ఇన్ని వైవిధ్యాలు గల డిగ్రీలు సంపాదించిన మీరు జ్యోతిష్యాన్నే ఎందుకు ఎంచుకున్నారు? అని అడిగితే 'నిజ జీవితంలో ఉపయోగపడుతుంది కాబట్టి' అని చెప్తారు. ఎంతో మంది తన దగ్గరికి ఎన్నో సమస్యలతో వస్తారని, వారి జ్యోతిష్యం చెప్పిన వెంటనే ఎంతో ఆనందంగా ఇంటికి వెళ్తారని చెబుతారామె.

### విద్యా దాహాన్ని తీర్చని ఇండియా బుక్ ఆఫ్ రికార్డు...

కొన్ని కోరికలు ఎప్పటికీ అప్‌డేట్ అవుతూనే వుంటాయి. అంటే ఒక కోరిక తీరగానే ఇంకో కోరిక... ఈ థియెరీ పద్మజారాణికి సరిగ్గా సెట్ అవుతుంది. ఒక డిగ్రీ పొందగానే మరో డిగ్రీ సాధించాలనే కోరిక కలుగుతుంది ఆవిడకి. అందుకే ఏకంగా 17 డిగ్రీలు సంపాదించింది. ఈ డిగ్రీల దాహన్ని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ గుర్తించింది. అత్యధిక డిగ్రీలు సాధించిన మహిళగా ఆవిడ రికార్డు సృష్టించింది. అయినా సాధించాల్సింది ఇంకా వుందని అంటారు.

### శ్రమకు ఫలితాలు...

మదిలోని తీవ్రకాంక్షను అంతే తీవ్రంగా శ్రమించి సాధించుకోవాలంటారు పద్మజ. నిజానికి లక్ష్య సాధనలో ఎన్నో అవాంతరాలు రావచ్చు. వాటిని కూడా స్వీకరించి ముందుకు సాగాలి. మనల్ని ఎంతో కష్టపెట్టిన వ్యక్తులను, సందర్భాలను చూసి ఒక చిరునవ్వు విసిరితే చాలు అదే ఒక విజయం. పంచరత్న ఎన్టీఆర్ స్మారక పురస్కారం, సౌందర్య స్మారక పురస్కారం, సౌందర్య రత్న, టంగుటూరి ప్రకాశం పంతులు స్మారక పురస్కారం, ఆదర్శ మహిళా పురస్కారం, ఉగాది పురస్కారం వంటి ఎన్నెన్నో పురస్కారాలతో పాటు జ్యోతిష్య దీప్తి, జ్యోతిష్య చూడామణి, జ్యోతిష్య రత్నాకర వంటి బిరుదులు కూడా సొంతం చేసుకున్నారు.

### ఒకరి విజయం వెనుక ఒక వ్యక్తి...

ప్రతి వ్యక్తి విజయం వెనక మరో వ్యక్తి ఉంటాడు. పద్మజ విషయంలో నిత్యం ఆమెకు ప్రోత్సాహాన్ని అందిస్తూ తోడూ నీడై వున్న వ్యక్తి ఆమె భర్త 'నందగోపాల్'. ప్రతి విషయంలో తన భర్త సహకారం ఉన్నందు వల్లే ఇంతగా రాణించగలిగానని చెబుతారామె. ప్రస్తుతం ఆవిడ హైదరాబాద్‌లోని ఒక బీఎడ్ కళాశాలకు ప్రిన్సిపాల్ కూడా. ఈ విధంగా తన విద్యార్థుల జీవితంలో వెలుగు నింపేందుకు కృషి చేస్తున్నారు.

### అందాల 'రాణి'...

ముంబైలో గ్లాడ్‌రాగ్స్ నిర్వహించిన మిసెస్ ఇండియా పోటీలో సెమీఫైనల్ వరకు వెళ్లారు. అంబికా దర్బార్‌బత్తి వంటి అనేక బ్రాండ్‌లలో మోడల్‌గా చాలా మందికి సుపరిచితమే. బెస్ట్ డ్రెస్‌డ్ వుమెన్, బ్యూటిఫుల్ ఫేస్, బెస్ట్ కపుల్ వంటి అందాల పోటీల్లో అవార్డులు ఎన్నో వరించాయి.